## కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష

● మాజీ ఎంపీపీ చెన్నబోయిన సైదులు


దిర్శించర్లలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నేరేడుచర్ల, ఏప్రిల్ 20: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలని మాజీ ఎంపీపీ చెన్నబోయిన సైదులు పిలుపునిచ్చారు. మండలంలోని దిర్శించర్ల గ్రామంలో ఆదివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రజతోత్సవ సభకు ఇంటికొకరు కదిలి రావాలని కోరారు. కేసీఆర్ నాయకత్వమే తెలంగాణ రాష్ట్రానికి శ్రీరామ రక్ష అన్నారు. అనంతరం సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మిడతపల్లి శ్రీను, పత్తేపురం వెంకటేశ్వర్లు, నన్నేపంగ సైదులు, కనకరాజుల రాంబాబు, కత్తి అనిల్, పంగ నాగరాజు, జానయ్య, అంజమ్మ, రామయ్య, కోటిరెడ్డి, వెంకన్న, గుర్వయ్య, నాగరాజు, లచ్చయ్య, సైదులు, నవీన్, వీరయ్య, శ్రీనివాస్, రాములు, మణికంట, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

మఠంపల్లి, ఏప్రిల్ 20: వరంగల్ జిల్లాలో ఈ నెల 27వ తేదీన జరుగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కోలాహలం కృష్ణంరాజు, లక్ష్మీనరసింహరాజు కోరారు. ఈ మేరకు ఆదివారం మండల పరిధిలోని యాతవాకిళ్ల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 'బీఆర్ఎస్ సభను జయప్రదం చేయాలి'

మేళ్లచెర్వు, ఏప్రిల్ 20: వరంగల్ జిల్లాలో ఈ నెల 27వ తేదీన జరుగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బోగాల బాల వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సభకు బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. మేళ్లచెర్వు మండలం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలను తరలించనున్నట్లు వివరించారు. సమావేశంలో మాజీ సర్పంచ్ పందిళ్లపల్లి శంకర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, శంభిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'రజతోత్సవ సభలో కార్మికులు పాల్గొనాలి'


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్‌కేవీ నియోజకవర్గ అధ్యక్షుడు ఉపేందర్

హుజూర్‌నగర్, ఏప్రిల్ 20: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు కార్మికులు తరలిరావాలని బీఆర్ఎస్‌కేవీ నియోజకవర్గ అధ్యక్షుడు పచ్చిపాల ఉపేందర్ కోరారు. హుజూర్‌నగర్‌లో ఆదివారం బజార్ హమాలీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఊరూరా కదిలి రావాలి

● బీఆర్ఎస్ నూతనకల్ మండలాధ్యక్షుడు మల్లయ్య


నూతనకల్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

నూతనకల్, ఏప్రిల్ 20: ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు ఊరూరా పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున కదిలి రావాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు మున్న మల్లయ్య కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి బత్తుల సాయిల్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ గాడ్డుల లింగరాజు, బత్తుల విద్యాసాగర్, మందడి సోమిరెడ్డి, మొగుళ్ల వెంకన్న, మూరగుండ్ల సైదులు, బత్తుల విజయ్, ఉప్పుల వీరుయాదవ్, గడ్డం యాదగిరి, మహేశ్వరం మల్లికార్జున్, వీరమల్ల యాదగిరి, సంగినేని సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

## సభకు జాతరలా తరలిరావాలి

● బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య


రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

తుంగతుర్తి, ఏప్రిల్ 20: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జాతరలా తరలిరావాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆ మేరకు ఆదివారం మండల పరిధిలోని కొత్తగూడెం, బాపన్‌బావి తండా గ్రామాల్లో నాయకులతో కలిసి రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, గుండగాని దుర్గయ్య, సింహాద్రి, కరుణాకర్, నిరంజన్‌రెడ్డి, మహేశ్, భూక్యా శ్రీను, మాజీ సర్పంచ్ వీరునాయక్, భిక్షానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రాఘవాపురంలో గడ్డివాము దగ్ధం


మోతె: మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మోతె, ఏప్రిల్ 20: ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గడ్డివాము దగ్ధమైన ఘటన మండల పరిధిలోని రాఘవాపురం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మట్టిపెళ్లి గంగరాజు ఉదయం పొలం నుంచి కట్టలు తీసుకొచ్చి గడ్డివాము వేసి ఇంటికి వెళ్లాడు. కొద్దిసేపటికే ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గడ్డివాము నుంచి మంటలు రావడంతో స్థానికులు ఆర్పేందుకు ప్రయత్నించారు. అయినా మంటలు ఆరకపోవడంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది గ్రామానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో సుమారు రూ.20 వేల విలువైన గడ్డి దగ్ధమైందని బాధితుడు వాపోయాడు.

### బొల్లంపల్లిలో జామాయిల్ తోట దగ్ధం

అర్వపల్లి: మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని గుర్రం శ్రీదేవికి చెందిన మూడున్నర ఎకరాల్లోని జామాయిల్ తోట పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేయడంతో వారు వచ్చి మంటలను ఆర్పారు. సుమారు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితురాలు వాపోయారు.

# నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

● బస్తాలు లేక, లారీలు రాక ఇబ్బందులు పడుతున్న కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులు


బాలెంలలోని కొనుగోలు కేంద్రంలో బస్తాలు లేక నిలిచిపోయిన ధాన్యం కొనుగోళ్లు


కాసరబాద సెంటర్‌లో లారీలు రాకపోవడంతో కాంటా వేసిన బస్తాలపై పట్టాలు కప్పుతున్న నిర్వాహకులు, రైతులు

సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 20: ఆరుగాలం కష్టపడి పంటలు పండించిన రైతన్నకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. వరి ధాన్యాన్ని అమ్ముకుందామని కొనుగోలు కేంద్రాల్లో పోసిన రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. కొనుగోళ్లు జరుగక పడిగాపులు కాస్తున్నారు. పలుచోట్ల ధాన్యంలో తాలు, అధిక శాతం తేమ ఉందని కొర్రీలు పెడుతుండడంతో రైతులు వాపోతున్నారు. దీనికితోడు కొనుగోలు కేంద్రాల్లో బస్తాలు లేకపోవడం మరో సమస్యగా మారింది. అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై సుమారు నెల రోజులు కావొస్తున్నా ధాన్యం బస్తాలు లేక కొనుగోళ్లు నిలిచిపోయినట్లు కేంద్రాల నిర్వాహకులు చెబుతున్నారు. మండలంలోని 23 కొనుగోలు కేంద్రాల్లో ఇదే పరిస్థితి ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. కాగా, ధాన్యం బస్తాల కోసం దూర ప్రాంతమైన నూతనకల్‌కు వెళ్లాల్సి వస్తోందని, అక్కడి నుంచి తీసుకురావాలంటే సుమారు రూ.3 వేల నుంచి రూ.4 వేలు ఖర్చు అవుతుందని, తీరా అక్కడికి వెళ్తే ఒక్కో సెంటర్‌కు వెయ్యి బస్తాలు మాత్రమే ఇవ్వడంతో అధిక భారం పడుతుందని కేంద్రాలు నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మరి కొన్ని సెంటర్లలో ధాన్యం కాంటా వేసినా లారీలు రావడం లేదని రైతులు చెబుతున్నారు. ధాన్యం కొనుగోళ్లు సరిగా జరుగపోవడంతో రైతులు సెంటర్లలో ఉన్న ధాన్యం రాశుల వద్ద పడిగాపులు కాస్తూ ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పడమే తప్ప చేతల్లో లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు జరుగలేదని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి సెంటర్లలో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## ప్రారంభమైన ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు


బాలుర ఉన్నత పాఠశాల సెంటర్‌లో అభ్యర్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

కోదాడ రూరల్, ఏప్రిల్ 20: కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, సీసీ రెడ్డి కాన్వెంట్‌లో ఆదివారం ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. బాలికల ఉన్నత పాఠశాలలో 204 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 174 మంది హాజరయ్యారు. అదేవిధంగా సీసీ రెడ్డి కాన్వెంట్‌లో 236 మందికి 218, బాలుర ఉన్నత పాఠశాలలో 224 మందికి 195 మంది హాజరైనట్లు మండల విద్యాధికారి ఎండీ.సలీంషరీఫ్ తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, అలసత్వం ప్రదర్శించొద్దని ఇన్విజిలేటర్లకు సూచించారు.

## 'ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని జయప్రదం చేయాలి'


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నాయకుడు ధనుంజయనాయుడు

నేరేడుచర్ల, ఏప్రిల్ 20: మే 1న ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ముఖ్య నేతలతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడే వేడుకలను గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలని కోరారు. కార్మికులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, మండల కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు కొమ్రరాజు వెంకట్, వీరబాబు, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## 'పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి'


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా నాయకుడు షేక్ యాకూబ్

గరిడేపల్లి, ఏప్రిల్ 20: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు షేక్ యాకూబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంఎస్ భవన్‌లో ఆదివారం జరిగిన గ్రామ పంచాయతీ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంచాయతీ కార్మికులు అతి తక్కువ వేతనంతో పని చేస్తున్నారని, కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యాలను కల్పించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. సమావేశంలో ముత్తయ్య, రాములునాయక్, మామిడి గోపి, గంగరాజు, శ్రావణ్ పాల్గొన్నారు.

## 'దీర్ఘకాలిక వ్యాధులు ఆయుర్వేదంతో పరిష్కారం'


శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యుడు

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 20: దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేద వైద్యంతో పరిష్కారం లభిస్తుందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, గండూరి ట్రస్ట్ నిర్వాహకులు గండూరి కృపాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 45వ వార్డులో గల గండూరి జానకమ్మరామస్వామి వాటర్ ప్లాంట్‌లో గండూరి ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీధరీయం ఆయుర్వేద నేత్ర క్లినిక్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణదాస్, శ్రీధరీయం బ్రాంచ్ మేనేజర్ పవన్, బెలిదె శ్రీనివాస్, దేవిరెడ్డి రవీందర్‌రెడ్డి, తోట శ్యాంప్రసాద్, గుడిపూడి వెంకటేశ్వర్‌రావు, గుండా లక్ష్మయ్య, నూకల వెంకటరెడ్డి, ఉప్పల రాజేంద్రప్రసాద్, కుక్కడపు భిక్షం, రాచకొండ శ్రీనివాస్, సత్యనారాయణ, భాస్కర్, చంద్రశేఖర్, సందీప్, కల్యాణ్, ఇస్మాయిల్, లతీఫ్ పాల్గొన్నారు.

## యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా జనార్ధన్

ఆత్మకూర్.ఎస్, ఏప్రిల్ 20: యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా తగుళ్ల జనార్ధన్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ప్లీనరీలో జాతీయ అధ్యక్షుడు మేకల రాములుయాదవ్ చేతులమీదుగా జనార్ధన్‌యాదవ్ నియామక పత్రం అందుకున్నారు.

## డ్రైనేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాలు


సర్వారం గ్రామంలో డ్రైనేజీలో వ్యర్థాలు

గరిడేపల్లి, ఏప్రిల్ 20: మండలంలోని సర్వారం గ్రామంలో గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో డ్రైనేజీల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో మురుగు వాసనను భరించలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అపరిశుభ్రతతో అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని, సంబంధిత అధికారులు స్పందించి వెంటనే డ్రైనేజీలను శుభ్రం చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## 'నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం'

పెన్‌పహాడ్, ఏప్రిల్ 20: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని పెన్‌పహాడ్ ఎస్ఐ కస్తాల గోపికృష్ణ అన్నారు. మండల పరిధిలోని అనాజిపురం, మాచారం గ్రామాల్లో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జన సంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు స్థానికులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో బొల్లక బొబ్బయ్య, దామోదర్‌రెడ్డి, చెన్ను రమణారెడ్డి, ఇటుకల శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'ప్రజావాణికి సకాలంలో హాజరుకావాలి'

నూతనకల్, ఏప్రిల్ 20: మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరుగనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని తాసీల్దార్ శ్రీనివాస్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి ప్రారంభమవుతుందని తెలిపారు.

## 'స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి'

గరిడేపల్లి, ఏప్రిల్ 20: గ్రామాల్లో సర్పంచుల పాలన లేకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, ప్రభుత్వం తక్షణమే స్థానిక సంస్థ ఎన్నికలు నిర్వహించాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గరిడేపల్లి మండలంలోని అనేక గ్రామాల్లో పారిశుధ్య సమస్యలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామాల్లో సర్పంచులు ఉంటే ప్రజలు తమ సమస్యలపై విన్నవించుకొని పరిష్కరించుకునేవారని అన్నారు. మంచి నీటి సమస్యలను దృష్టిలో పెట్టుకొని యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు.

## ఈత సరదా విషాదంగా మారకూడదు : ఎస్పీ నరసింహ

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 20: వేసవిలో విద్యాలయాలకు సెలవుల నేపథ్యంలో పిల్లలు సరదా కోసం చెరువులు, కాల్వల ఈతకు వెళ్తుంటారని, ఈత సరదా విషాదం కారాదని ఎస్పీ కె.నరసింహ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈతకు వెళ్లే పిల్లలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటిలో మునిగి ప్రాణ నష్టం జరుగకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈత రాని వారు బావులు, చెరువుల వద్దకు ఒంటరిగా వెళ్లరాదని, తల్లిదండ్రుల సమక్షంలో ఈత నేర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలని సూచించారు.

## 22న పలు నియోజకవర్గాల్లో మంత్రి ఉత్తమ్ పర్యటన

కోదాడ, ఏప్రిల్ 20: కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ నెల 22న పర్యటించనున్నారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మిర్యాలగూడలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఆ తర్వాత తుంగతుర్తి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

## కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పరామర్శ


వెంకటమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

తిరుమలగిరి, ఏప్రిల్ 20: మండల పరిధిలోని వెలిశాల గ్రామానికి చెందిన కుడా (కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి తల్లి వెంకటమ్మ ఇటీవల మృతిచెందారు. కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఆదివారం వెలిశాల గ్రామంలో యాదవరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంకటమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాగుర్ల వెంకన్న, భరత్‌రెడ్డి, శోభన్‌బాబు, చింతల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఆత్మకూర్.ఎస్, ఏప్రిల్ 20: జిల్లా కేంద్రంలోని కుడకుడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం నెమ్మికల్‌లోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి గురువులను సత్కరించి షీల్డ్‌లు అందజేశారు. అనంతరం నాటి ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ 25 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఒకరికొకరు సహకరించుకుంటూ జీవితంలో ఎన్నో మైలురాయిలు దాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కంచుగట్ల ప్రవీణ్, శంకర్, రవి, క్రాంతి, షాహిద్, పున్నయ్య, విశ్వవాణి, కవిత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం

తిరుమలగిరి, ఏప్రిల్ 20: మండలంలోని తాటిపాముల గ్రామానికి చెందిన అభ్యుదయ యువజన సమైక్య యూత్ కార్యదర్శి సంతోశ్‌కుమార్ ఇటీవల గాయపడగా ఆపరేషన్ నిర్వహించారు. సమైక్య యూత్ అధ్యక్షుడు రేగుల మహేందర్ ఆధ్వర్యంలో సంతోశ్‌కుమార్ వైద్య ఖర్చుల నిమిత్తం ఆదివారం రూ.14 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు బోయపల్లి కిషన్, దయాయాదవ్, కోల మహేశ్, పాలబిందెల ఉమేశ్, కోల మల్లేశ్, కొడిదల రాజు, అంజి, నర్సయ్య, మురళి, బలరాం, అవిలయ్య, మహేశ్, సురేశ్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఈస్టర్ వేడుకలు


నేరేడుచర్ల : దిర్శించర్లలోని చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

సూర్యాపేట టౌన్/పాలకవీడు/నేరేడుచర్ల/తిరుమలగిరి/చివ్వెంల, ఏప్రిల్ 20: జిల్లావ్యాప్తంగా ఆదివారం ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని వినిపించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు మార్గం సర్వ మానవాళికి ఆదర్శనీయమని పేర్కొన్నారు.

## 'గ్లోబల్ వార్మింగ్ నుంచి భూమిని కాపాడాలి'

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 20: గ్లోబల్ వార్మింగ్ నుంచి భూమిని కాపాడుకుందామని చండూరు ఆర్డీఓ వందనపు శ్రీదేవి అన్నారు. ఏప్రిల్ 22న ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రీన్ క్లబ్ ట్రస్ట్ సభ్యుడు వనమాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో గ్రీన్ వాక్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ చెట్లను నరికేయడంతో పాటు వాహనాల ద్వారా వెలువడే కాలుష్యం తదితర కారణాలతో గ్లోబల్ వార్మింగ్ పెరిగిపోయిందన్నారు. ప్రజలు ఇండ్లలో మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో గ్రీన్‌క్లబ్ ట్రస్ట్ అధ్యక్షుడు ముప్పారపు నరేందర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ తోట కిరణ్, సభ్యులు మిర్యాల వెంకటేశ్వర్లు, సోమా హేమమాలిని, తల్లాడ రామచంద్రయ్య, దేవరశెట్టి నాగరాజు, సోమా సురేశ్, కొక్కుల సంపత్ పాల్గొన్నారు.

# శిథిలావస్థలో వ్యవసాయ కార్యాలయ భవనం

● నూతన భవనానికి స్థలం కరువు


● ఇబ్బందుల నడుమ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది


శిథిలావస్థలోని వ్యవసాయ శాఖ కార్యాలయం భవనం

నేరేడుచర్ల, ఏప్రిల్ 20: నేరేడుచర్ల మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయ భవనం శిథిలావస్థలో ఉంది. దీంతో ఇబ్బందుల నడుమ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. నేరేడుచర్లలో వ్యవసాయ శాఖ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో కొన్నేళ్లుగా మార్కెట్ కమిటీ కార్యాలయంలోని ఒక గదిలోనే వ్యవసాయాధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అయితే, గది కిటికీలు, తలుపులు విరిగిపోవడంతో పాటు వర్షం వచ్చినప్పుడు భవనం పైకప్పు కురుస్తుండడంతో సిబ్బందికి సమస్యగా మారింది. కార్యాలయంలోకి పలుమార్లు పాములు కూడా రావడంతో ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు.

### నిధులు మంజూరైనా నిర్మాణానికి స్థలం లేకపోవడంతో..

నేరేడుచర్ల వ్యవసాయ కార్యాలయ భవన నిర్మాణం కోసం గతంలో రూ.20 లక్షలు మంజూరయ్యాయి. కానీ స్థలం లేకపోవడంతో నిర్మాణానికి నిధులు మంజూరయినా నిరుపయోగం అయ్యాయి. భవన నిర్మాణం కోసం కావాల్సిన భూమిని చూపించాల్సిన రెవెన్యూ అధికారులు ఇప్పటి వరకు భూమిని తేల్చలేదు. నిత్యం రైతులకు అందుబాటులో ఉండాల్సి వస్తుండడంతో అధికారులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ శిథిలావస్థకు చేరిన గదిలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. కార్యాలయంలోని విలువైన కాగితాలు, సామగ్రి కూడా మార్కెట్ యార్డ్ కార్యాలయంలోనే మరో గదిలో దాచుకోవాల్సి వస్తోంది. కాగా, ఇటీవల నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి వచ్చిన నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి స్థానిక నాయకులు, అధికారులు శిథిలావస్థకు చేరిన వ్యవసాయ కార్యాలయం భవనం పరిస్థితిని వివరించి నూతన భవన నిర్మాణానికి నిధులు, స్థలం కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఖాళీ స్థలం చాలా ఉన్నందున ఇక్కడే స్థలం కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మరోసారి మంత్రి దృష్టికి తీసుకెళ్లి నూతన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడంతో పాటు స్థలం కేటాయించే విధంగా చూడాలని అధికారులు కోరుతున్నారు.


పెచ్చులూడిన గది పైకప్పు

### భయంతోనే విధులు

**- జావిద్, ఏఓ**

శిథిలావస్థలోని భవనంలో విధులు నిర్వహించాలంటే భయంగా ఉంది. నిత్యం ఏదో ఒక సమస్యతో వచ్చే రైతులకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నాం. ఈ భవనం వర్షం వస్తే కురుస్తోంది. కిటికీలు సక్రమంగా లేకపోవడంతో పాములు సైతం వస్తున్నాయి. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిస్థితి వివరించాం. త్వరలోనే స్థలం కేటాయించి నిధులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.